# సంది

'సంది' అల్లనేరేడు పండులా నిగనిగలాడుతూ వుంటుంది.

నేరేడు పండు పోలిక చెప్పగానే శ్యామసుందరమైన నవనీత చోరుని శరీరకాంతి మనస్సులో మెదలకపోదు. అలాంటి నీలమేఘసదృశ ఛాయే ఆ పిల్లది. అందుకేనేమో? ఆ పిల్లను 'శ్యామలీ' అంటూ హరిబాబు పిల్చుకుంటాడు. ఒక్క హరిబాబు తప్ప ఆ పేరుతో దాన్ని మరెవ్వరూ వ్యవహరించరు. వూరి వారందరికీ అది కేవలం 'సంది' మాత్రమే. ఆ పేరుపై కేవలం హరిబాబు ఒక్కడికే గుత్తాధిపత్యం వున్నట్లుంది. నిజానికి 'సంది' అసలు పేరు సంధ్యావళి, దానికి ఆ పేరు పెట్టింది కూడా యజమానురాలైన జగదీశ్వరీదేవి. ఈ జగదీశ్వరి ఆ వూరి భూకామందు జగన్నాథంగారి భార్య.

జనగ్నాథంగారంటే? ఏదో మాటల్తో పోయే మనిషి కాడు. అన్నిట్లో గణనీయుడే. బాగా పరపతి వున్న కుటుంబం. మూడు తరాలనుండి తరగక పేరుకుంటున్న సంపత్తికి అధిపతిగా నలుగురికి పెట్టి పోషిస్తూ. పదిమందికి మంచీ చెడు చేసే స్థితికి ఎదిగినవాడు జగన్నాథం. ఈ యాభై ఏళ్ల పడిలో కూడా పైలా పచ్చీసులో వున్న కోడెకారులా చురుగ్గా బలంగా వుంటాడు. పైకి అనకూడదు కాని సామాన్యుడు మాత్రం కాడు.

జగదీశ్వరీదేవి చల్లని మనస్సు కాలుతుందని తప్ప, నిజం చెప్పుకోవలసి వస్తే, మహా ఘటికుడూ, జల్సారాయుడు అనే చెప్పుకోవాలి. జగన్నాథంలో మంచి వాకచాక్యం కూడా వుండబట్టే భార్య దృష్టిలో తాను ఎంతో మంచివాడు. ఎంత విశాల హృదయుడు, కాకపోతే 'సందిని' అలా ఆదరిస్తాడా? అనే అంత సౌమ్యంగా ప్రవర్తిస్తాడు. ఉత్తమెరమెచ్చుల మేడిపండు రకం. 'అయినా దొడ్డ మనిషిలా చెలామణి అవుతున్న అదృష్టజాతకుడు.

జగదీశ్వరీ దేవి వుత్తమ యిల్లాలు. ఆ యింటికి ఆమె ఒక లక్ష్మీకళ. ఆమె ఆదరణవల్లే ఆ ఇల్లు అతిథులతో, పనిపాటల వాళ్లతో ఎప్పుడూ కళకళలాడుతూ ఉంటుంది. ఆకలితో

ము కడప తొక్కిన నిరుపేద కడుపు నిరాశతో ఖాళీగా ఎప్పుడూ వెళ్లలేదు. ఆమె చల్లని చేయి ఎందరి వీపుతట్టి కన్నీళ్లు తుడిచిందో కాని ఎవ్వరి నోట విన్నా ఆమె మంచిని గూర్చే వినిపిస్తుంది. ఆ తల్లి చేస్తున్న పుణ్యఫలమే హరిబాబు అంటారు జనం.

నీళ్లు నిండిన చెరువును ఆశించి కప్పలూ, పాములూ, చేపలూ చేరినట్లు అనేక కారణాల వల్ల బంధుమిత్రవర్గం ఎప్పుడూ ఆ యింటిని ఆశ్రయించి రాకపోకలు చేస్తుంటారు. వీరందరిలో ప్రత్యేకంగా చెప్పుకోదగ్గవ్యక్తి భూపతిరాజు. ఈయన వరుసకు జగదీశ్వరీదేవికి తమ్ముడు. జగన్నాథం గారికి ఆత్మీయుడు.

కారణం ఏదో? కానీ ఈ మధ్య భూపతిరాజు గారికి అక్కగారి వూంపై మక్కువ అధికమైంది. రాకపోకలు కూడా దాదాపు రెట్టింపుగా సాగుతున్నాయి.

'సంది' యిప్పుడిప్పుడే యీడేరి జవ్వనపు తొలకరిలో తడుస్తూవుంది. పుడమి తల్లి పోషణతో ఏపుగా, గుబురుగా ఎదిగిన వనశోభకు వసంతోదయంలా యౌవనం పొంకమైన దాని అంగసౌష్టవానికి మరింత పుష్టినీ, సంపూర్ణతలనూ, చనుకట్టుకు బిగువునూ ఆపాదిస్తూవుంటే అది పుష్పించిన గున్నమావిలా, విగ్రహ రూపాన్ని పొందిన అహల్యలా, గండరువు చేసిన శిల్పకళా విలాసంలా కన్పిస్తూంది. దాని రెండు కళ్లు మకరందాసక్తమై చిక్కిన గండు తుమ్మెదల్లా తటతటలాడుతుంటాయి. నునుపుదేరిన దాని చెంపలు తారళ్యంతో తళతళ్లాడుతూ పసిపాప పాలబుగ్గల్లా, పచ్చి కొబ్బరి ముక్కల్లా చూచే కొద్దీ ఏదో ఆసక్తి రేకెత్తిస్తూ వుంటాయి.

ఇలా విరబూస్తూ వున్న దాని అవయవ శోభతో కానీ శరీరంలో కలుగుతున్న మార్పులతో కాని సందికి ఏ సంబంధమూ లేనట్లే నిర్వికారంగా నిశ్చింతగా వుంటుంది. నిజానికి దానిలో ఏ వికారమూ లేదు. అది భూపుత్రి!

పొద్దు పొడుపుతో పాటే సంది లేస్తుంది. లేవగానే పశువుల పాకకు వెళ్లి సంది గోమాతకు నమస్కరిస్తుంది. ఆ పాకను కసువూడ్చి శుభ్రం చేస్తుంది. పాలు పితుకుతుంది. పితికిన నులివెచ్చని పాలను పొంగు ఆరకముందే వో చిన్న చెంబెడు త్రాగడం దానికి అలవాటు. అలా తాగితే గాని దానికి ఏ పనీ తోచదు. ఆ తరువాతే దాని దినచర్య ప్రారంభమౌతుంది.

పితికిన పాలను తీసుకెళ్లి పోయవలసిన నాలుగిళ్లకు పోస్తుంది. 'అది కాలుమోపితే చాలు యిళ్లన్నీ వెలుగులు నిండుతాయి' అంటారు ఆడవాళ్లు.

'అది గాలిలా, తొలకరిజల్లులా, సంపంగి వాసనలా ప్రవేశిస్తుంది' అంటుంది. పంతులమ్మ.

అది వెళ్లిన చోటల్లా అందరినీ ఆప్యాయంగా ఏదో వరస కలిపి పలుకరిస్తూ అన్ని యిండ్లూ తనవిగా యిళ్లన్నీ తానుగా తిరుగుతూ అరమరికలు లేని మంచిని పెంచుకుంటూన్న సందిని చూసి ఆ వూరి పూజారి మెచ్చుకోలుగా-

'సంది పూర్వం ఏదో వుత్తమ జన్మే ఐవుంటుంది. అజ్ఞాతంగా వెన్నంటిన ఏ పాపమో? శాపమో? కానీ సందికి ఈ జన్మలో నికృష్టమైన యీ వూడిగపు జీవనాన్ని కల్పించి చేయిస్తూ వుంది. కాని, భవిష్యత్తులో యీ పిల్లకు మేలు కలుగుతుంది' అంటూ దీవెనలు వర్షిస్తాడు.

సంది యిట్లా వాడుకగా పోయవలసిన నాలుగిళ్లకు పాలుపోసి యజమానురాలైన జగదీశ్వరీదేవి యింటికి వస్తుంది. ఇంటికి వచ్చిరావడంతోటే యిల్లంతా తానై, నెత్తిన నోరు మోస్తూ పనివాళ్లందరికీ పనులు పురమాయిస్తూ, జగదీశ్వరి చేతిలో గరిటెలా మసలుతూ వుంటుంది.

సందికి తల్లి పురిటిలోనే పోయింది. అప్పటి నుండీ తమ సేవలో వున్న రాముడి బిడ్డగా సంది ఆలనాపాలనా అంతా జగదీశ్వరీ దేవే చూచింది. అందుకే ఆ యింట్లో ఎందరు పనిపాటల వాళ్లున్నా, ఆమె ఎదలో సందికి వో ప్రత్యేకమైన స్థానం వుంది. అది జగదీశ్వరీ దేవి పెంచిన పెరటి మొక్క.

ఈ పెరటి మొక్కే మానై పనివాళ్లందరి కన్నెర్రకు కారణమైంది. వోనాడు సరుకులు తెచ్చే బాలయ్య సంది మీది ఈర్ష్యతో 'అమ్మగారు పాపం అంటూ దీనికి చనువు యిస్తే దానికేమో తల మీదకళ్లు మొలిచి మనం ఎవ్వరం దానికి కనిపించడం లేదు. ఇంకా నయం చదువురాదు కాబట్టి సరిపోయింది. అట్లా కాక, ఏమాత్రం అక్షరం తెలివి వుండీ లెక్కలూ, అవి తెల్సివుంటే యింటి పని వాళ్లందరికీ యజమానురాలిలా మనందరినీ నిల్చోబెట్టి లెక్కల జమాబంది చేసేది. నల్లనాగి' అంటూ తన అక్కసును వెళ్లబోసుకుంటూ వుంటే, ఆ మాటలు యాదృచ్ఛికంగా ఆ వైపునుండి వెళుతున్న జగదీశ్వరీదేవి చెవిలో పడ్డాయి.

ఆ మాటలు విన్న జగదీశ్వరీ దేవి స్పందించింది. ఏదో పనివాళ్లు, వాళ్లకు సహజమైన రీతిలో వుబుసుపోకకు చెప్పుకునే మాటలుగా కొట్టివేయలేదు. ఆ మాటలలోతుపాతులను బాగా ఆలోచించింది. కొడుకును పిలిచి 'బాబూ హరి! మన కర్రికి అదే మన సందికి వో రెండు ముక్కలు వ్రాయనూ చదువనూ నేర్పించరాదురా?' అంటూ హెచ్చరించింది. హరికి యిదో పనిష్మెంట్‌లా కనపడ్డా తల్లి మాటను కాదనలేక హరిబాబు పదేళ్ల సందికి పాఠాలు ప్రారంభించాడు. భయభక్తులతో సంది మూడేళ్ల పాటు హరిబాబుతో చదువునేర్చుకుంది. దాని కుశాగ్రబుద్ధినీ శ్రద్ధనూ గ్రహించిన హరిబాబు దానికి లెక్కలతో పాటు యింగ్లీషు కూడా నేర్పించాడు.

కాలేజీ చదువు కోసం హరిబాబు పట్టణం వెళ్లాడు.

సంది తాను నేర్చుకున్న చదువును వానాకాలం, ఎండాకాలం చదువులా ముగించుకోలేదు. పాఠాలు చెప్పే గురువు లేకపోయినా దాని సాధన విడువలేదు. పనులన్నీ ముగించుకుని తీరికగా వున్న సమయాల్లో ఎవ్వరికీ తెలియకుండా పుస్తకాలు తెచ్చుకుని

చదువుతుంది. పెద్దయ్యగారు అంటే జగన్నాథంగారు చదివిన తరువాత పేపర్లు జాగ్రత్త చేసే నెపంతో యింగ్లీషు పేపరు తెచ్చుకుని స్పెల్లింగ్‌తో తంటాలు పడ్తూ చదువుకుంటుంది. ఇంగ్లీషు వార్తలప్పుడు శ్రద్ధగా విని తాను చదివిన దానితో సమన్వయ పర్చుకుంటుంది.

ఇట్లా ఏ తొణుకూ లేకుండా అమాయకంగా కాపలా కుక్కలా పరమగయ్యాళిలా పనులన్నీ ఎప్పటిలా చేసుకుపోతూనే వుంది. సంది యింత ఎదిగినట్లు ఆ యింట్లో ఎవ్వరికీ తెలియదు. హరిబాబుకూ తెలియదు. హరి దృష్టిలో సందికి ఏ ప్రత్యేకత లేదు. కేవలం సంస్కారం వున్న యువకుడిలా దిక్కులేని పిల్లపై చూపే దయ మాత్రం చూపుతాడు.

ఎండాకాలం సెలవల్లో హరి స్నేహితులు పల్లెటూరు చూద్దామంటూ వస్తారు వచ్చిన వాళ్లందరికీ సపర్యలు చేయవలసిన బాధ్యత సందికే మిగులుతుంది. పాపం! సంది అలసట లేకుండా అన్ని పనులూ చక చకా నవ్వుతూ చేస్తుంది. ఆ యీ పనులు చక్కబెడ్తూ తమకు సౌకర్యాలు కల్పిస్తూన్న సందిని చూచి హరి స్నేహితులు అల్లరిగా -

'హరీ! హూ ఈజ్ దిస్ బ్లాక్ బ్యూటీ? అంటూ జోక్ చేస్తే, హరి సమాధానంగా అది పనిపిల్ల, అయినా! దాన్ని అలా అనడానిక్కానీ, చూడ్డానికి కానీ వీలులేని నిషిద్ధాక్షరి. అది, మా అమ్మగారికి పెంపుడు కూతురులాంటిది. అంటూ గమ్మత్తుగా కొట్టి పారవేస్తాడు. అది విని అందరూ నిష్కపటంగా గొల్లున నవ్వుతారు. అన్నీ గ్రహించి కూడా ఏదీ తెలియని పరమ మూఢబుద్ధిగా మసలుకుంటుంది సంది. ఇదంతా దానికేం పట్టదు. దానికి కావలసింది కేవలం అమ్మగారైన జగదీశ్వరీ దేవి. ఆమె ఇంటి సేవ! అంతే!

ఇలా మూడేళ్లు గడిచాయి. వోనాడు వున్నట్లుండి భూపతి రాజు ఏదో అర్జంటు పని వున్నట్లు సందిని కొత్తగా 'నీలా! నీలిమా!' అంటూ పిలుస్తూ పిల్లిలా మెల్లగా సంది వున్న చోటికి వచ్చాడు. ఆ పిలుపు తనను వుద్దేశించేనని గ్రహించి కూడా సంది ఏ మాత్రం స్పందించకుండా ఆ పేరుతో తనకేం సంబంధం లేనట్లు ఆ పిలుపును పట్టించుకోకుండా పెడచెవిని బెట్టి, తన పనేదో తాను చూసుకుంటూ అవతలికి నడిచింది.

ఆ పిల్ల నిర్లక్ష్యాన్ని గ్రహించిన భూపతిరాజు తనను చులకన చేస్తుందనే కోపంతో ధ్వనిని రెట్టిస్తూ ' ఏమే సంది? యిందాకటినుంచి కేకవేస్తుంటే వినపడ్డంలేదా? వినిపించుకోవు? అక్కగారి అలుసు ఎక్కువై, వొళ్లు బలిసి కళ్లు నెత్తికెక్కాయ్' అంటూ నానా మాటలన్నాడు.

అయినా సంది నిర్వికారంగా 'దొరగారూ! మీరు ఎన్నడూలేంది కొత్తగా 'నీలా- గీలా అంటే నాకెలా తెలుస్తుందండి! అది నా పేరని? మీరు నాకా పేరు పెట్టినట్లు ఎప్పుడూ చెప్పలేదు. అమ్మగారు కూడా చెప్పలేదు. అందుకే మీరలా పిల్చినప్పుడు ఎవర్ని పిలుస్తున్నారో తెలియక పలకలేదు. ఈ తేపకు నా తప్పు కాసి వదిలేయండి. కాని నన్ను కొత్తపేరుతో మట్టుకు పిలవకండి. ఈ మట్టిబుర్రలో ఆ పేరు యిమడదు కదండీ! సరేనా అయ్యగారు. పనేటో చెప్పేసేయండి' అంటూ అమాయకతను ప్రదర్శించింది.

సంది మాటలు విన్న తరువాత భూపతిరాజు యిరకాటంలో చిక్కాడు 'నిజమే! ఈ అలగా జనానికి నేనేదో రాసిక్యంతో ముద్దుగా పిల్చుకుంటే ఏం అర్థమై చస్తుంది. అది నిజమే చెప్పింది. చదువా? సంస్కారమా? శృంగారలీలలూ, సుతిమెత్తని పిలుపులూ అవీ తెలిసేటందుకు? ఛీ! ఛీ! పోయి పోయి సవారూపాయి చేయలేని పనిదానివెంట నా మనస్సు ఎట్లా! ఎందుకు? మోజుపడి తిరుగుతుందో? తెలియకుండా వుంది' అంటూ ఆలోచనలో పడ్డాడు.

తెలియకపోవడం ఏమిటీ, దాని కళ్లతళుకులు చూస్తే తెలుస్తుంది. చెంపలనిగనిగలు చూస్తే అర్థమౌతుంది. ఆకర్షణ.

మణులను గూర్చి చెప్పేప్పుడు అనర్ఘ రత్నాల్లో నీలమణిని కూడా చేరుస్తారు. ఆ కారణంగానే శ్రీకృష్ణుని 'నీలమణీ' అంటారు. ' ఆ మణి కాంతిని ఎవరైనా చూచినట్లైతే దాని చెంపల సొగసు అర్థమౌతుంది. అట్లాగే అపురూపమైన ముత్యాల్లో నల్లటి ముత్యాలను గణిస్తారు. ఆ ముత్యాల తారళ్యం చెప్పనలవి కాదు. మేఘాచ్ఛన్నమైన రాత్రి నిండుగర్భిణిలా నీరు మోస్తున్న నీలి మేఘంలో విద్యుత్తరంగం చొచ్చినప్పుడు అది అసంఖ్యాకమైన కాంతి పుంజాలతో చకచకితమైనప్పుడు కనిపించే కాంతి  ఆ ముత్యాల్లో వుంటుందంటారు. అవి మేలిసురటీలకన్నా ఎన్నో రెట్లు విలువైనవి. ఆ నల్లముత్తెపు కాంతే ఆ సంది చెంపల్లో, కళ్లల్లో కనిపిస్తుంది. చూడలేదు కాని, చెప్పే మాటల బట్టి అది అంటే సంది ద్రౌపదిలా వుంటుందని వూహించుకోవచ్చు. ఇదే దాని అకర్షక శక్తికి మూల కారణం.

కొన్నాళ్లనుండి పెద్దయ్యగారు అదే మన జగన్నాథం గారి కళ్లలో కూడా సంది కనిపించినప్పుడల్లా వో కోరిక చెమక్‌మంటుంది. కాని తాను తండ్రిలాంటివాడు. ఆ జగదీశ్వరీదేవికి తెలిస్తే? అమ్మో యింకేమన్నా వుందా? యిల్లు నీరౌతుంది' అంటూ, ఆ కోరికకు పగ్గాలు బిగిస్తాడు. అయినా కండువా చేతికి ఇచ్చినప్పుడూ, తగిలినదాని చేతి స్పర్శ మధ్యవయస్కుడైన జగన్నాథంగారి నరనరాల్లో విద్యుత్తు ప్రవహింపజేస్తూ జల్లుమనిపిస్తుంది. అప్పుడు ఆప్యాయతను వొలకబోస్తూ నిలువెల్లా కళ్లు చేసుకొని 'సందీ! ఎంతలో ఎంతదానివయ్యావే ? అంటూ చెంపలు నిమురుతాడు.

'అయ్యగారెంత గొప్పవారు! అవునుమరి! మా అమ్మ మొగుడు గొప్ప వారు కాకపోతే మరేమౌతారు ? నన్ను తల్లీ తండ్రుల్లా యిద్దరూ ఆదరిస్తున్నారు.' అంటూ మురిసిపోతుంది సంది.

మళ్లా వోనాడు భూపతిరాజు చేతిలో వో పొట్లం పట్టుకుని దర్శనం యిచ్చాడు. ఆ నాటి సంఘటన తరువాత భూపతిరాజు కోరికకు పిలకలు పుట్టి అవి ఒక్కొక్కటే మోసులెత్తుతూ పిలకలు వారి కలగాపులగం గా అల్లుకుని తనకు వూపిరి సలపకుండా చేస్తున్నాయి. అందుకోసం వో పథకం ఆలోచించాడు.

'అది నన్నెంతగా ఆకర్షించినా, నేనెంత మోజుపడ్డ, రొమాంటిక్ భావాలు దానికేం తెలిసి ఏడుస్తాయి. డైరెక్ట్-యాక్షన్ ఈజ్ బెటర్, ఏదో మంచి చీర దాని కళ్ళు జిగేలుమనిపించేలా తీసుకెళ్లి యిచ్చాననుకో, కానని మొకం కదా! వింతగా చూస్తూ మహాభాగ్యం అంటూ నా వశం కాదా? అంటూ జగజగ మెరిసే వో చౌకబారు చీర, పౌడరు డబ్బా కొని పొట్లం చుట్టి తెచ్చాడు. సందిని వెతుక్కుంటూ వెళ్లి 'సందీ! నీకేం తెచ్చానో చూడు'! అంటూ చేతికందిచ్చాడు.

కలిసి వచ్చిన దైవంలా అప్పుడే జగదీశ్వరీ దేవిగారు 'సందీ! ఎక్కడున్నావ్? యిలా రా! అంటూ కేక వేసింది. ఆ పిలుపు విని 'అమ్మా! వస్తున్నా! అంటూ చెంగున జింకపిల్లలా పరుగుపెట్టి ఆమె సమీపానికి వెళ్లింది.

పాపం! భూపతిరాజు నిలువెల్లా చెమటలు పోస్తూ నిర్ఘాంతపోయి చూస్తూ నిలుచుండిపోయాడు.

సంది జగదీశ్వరీదేవికి, తన చేతిలో వున్న పొట్లాన్ని చూపుతూ 'అమ్మా! ఇది నాకు భూపతి దొరవారు యిచ్చారు. అప్పుడే మీరు పిలిచారు! అంటూ భగ్గున మండుతున్న ఎదకుంపటిని కనపడనీయకుండా నిగ్రహించుకుని మామూలుగా పసిపిల్ల తనకెవరో చాక్లేటుయిస్తే తీసుకుందునా? వద్దా? అంటూ తల్లిని ప్రశ్నించినట్లుగానే పొట్లాన్ని ఆమె చేతికి అందించింది.

ఆ పొట్లాన్ని విప్పి చూచిన జగదీశ్వరీదేవిని ఎవరో వెనకవైపు బాకుతో పొడుస్తూ హెచ్చరించినట్లైంది. ఆమెకు భూపతిరాజు ప్రవర్తన చీమలూ జర్రులు పాకినంత చీకాకు కల్పించింది. కానీ తన్ను తాను సంభాళించుకుని సందిని అవతలికి పంపించి, తానే స్వయంగా భూపతిరాజు వద్దకు పోయి ఆప్యాయంగా పలుకరిస్తూ..

' ఏం నాయనా! ఎప్పుడొచ్చావ్? ఎలావున్నావ్? ఆఁ అన్నట్లు మరిచాను; నీవేదో మన పనిపిల్ల సందికి బహుమతిగా మంచి చీర తెచ్చినట్లున్నావ్? అది నీ వుదారతకు నిదర్శనం, కానీ నన్ను చిక్కుల్లో పెడ్తున్నావ్ బాబు! అది చేసిన పనికి యిలాంటి ప్రోత్సాహకాలు యిస్తూ వుంటే అది మన తలపై ఎక్కి కూర్చుంటుంది. పైగా రేపు యింటికి వచ్చిన వారందరూ తాను చేసే పనికి యిలాగే మంచి బహుమతి యివ్వాలంటూ ఆశపడ్తుంది. అంతేకాదు, రేపు అది పెళ్లికాబోయే పిల్ల! యిప్పుడు యిలా విలాసాలకు అలవాటు పడ్తే రేపు దానికి జరగడం కష్టం. మనమే దాన్ని పెడదారిన పెట్టి చెడగొట్టినవాళ్లం అవుతాం. అది చేసే సేవలకు దానికి తృణమో ప్రణమో యివ్వదల్చుకుంటే ? దాని పెళ్లినాడు యివ్వవచ్చు. ఇలా అన్నానని మనస్సు నొచ్చుకోకండి తమ్ముడూ' అంది.

'అక్కగారూ! నన్ను క్షమించండి. తెలియక చేసిన తప్పిదాన్ని మన్నించండి. నేనింత దూరం ఆలోచించలేదు. ఏదో చిన్న పిల్ల. పైగా నీకు యిష్టురాలు. రేపు పండగకు కట్టుకుని

సంతోషిస్తుందనుకున్నాను. అసలు మీ చేతికిచ్చే దానికి యివ్వమంటాను అనుకున్నాను, కానీ ఏదో మనింట్లో కూటికి పడివున్న తొత్తుకోసం పెద్ద ఆలోచన ఎందుకంటూ యిచ్చాను. అంతే' అంటూ ముగించాడు.

సందిని 'తొత్తు' అంటూ చులకన చేస్తూ మాట్లడిన భూపతిరాజు మీద ఎక్కడలేనంత కోపం వచ్చింది. కానీ పెద్ద యిండ్లలో తర్ఫీదు పొందిన వారి ప్రవర్తన వేరుగా వుంటుంది. హాలాహలాన్నైనా, అమృతాన్నైనా సడీ చప్పుడు లేకండా మింగనూ గలరు. జీర్ణించుకోనూ గలరు. అందుకే జగదీశ్వరీదేవి భూపతిరాజును మందలింపుగా ఏమీ అనలేక పోయింది. పైగా 'అది నీ ఔదార్యానికి, హుందాతనానికి చిహ్నం బాబూ, కానీ ఈ రోజుల్లో పనివాళ్లను తొత్తులుగా భావించడం అంత భావ్యం కాదేమో' అంటూ చురక పెట్టింది.

జగదీశ్వరీదేవి పానకంలో పుడకలా తనకూ సందికి మధ్యలో ప్రవేశించి తనకు దక్కబోయే రసరామణీయకానికీ, అనుభవించబోయే అనంగసౌఖ్యానికి భంగం కల్పిస్తూందని లోలోపల కసిగావున్నా పైకి ఎంతో వినయాన్ని ప్రదర్శిస్తూ -

' ఇలాంటి కొరగాని పనులు నాతో మరోసారి జరుగవంటూ నేను మీకు విన్నవించుకుంటున్నాను' అంటూ చకాచక వెళ్లిపోయాడు.

ఇలాంటి పెద్ద పెద్ద యింటివారి సంప్రదాయ పరిరక్షణా విధానం. పురుగాడి బూజు పట్టి కుక్కమూతి పిందెలు వేస్తున్న గృహనీతికీ పండిన మేడిపండులాంటి సంస్కృతికి మారు పేరుగా సాక్ష్యం యిస్తూ యింకా ప్రవర్తింపబడుతూనే వుంది.

ఈ తతంగం అంతా నాటకంలా పక్క వరండాలో సిగరెట్టు కాలుస్తూ చూస్తున్న జగన్నాధం గతుక్కుమన్నాడు. 'అమ్మ బాబోయ్! ఈ వేటలో వీడూ చిక్కుకున్నాడన్న మాట. అయితేనేం? గెలుపెవరిదో ? చూస్తాను' అంటూ అప్రయత్నంగా మీసం పైకి చెయ్యి పోనిచ్చాడు. ఎర్రజీరకళ్లల్లో విస్ఫులింగాలు చిలికింది.

ఆనాటి రాత్రి జరిగిన సంఘటనంతా జగదీశ్వరీదేవి భర్తకు చెప్పి ' ఏమండీ మీ అభిప్రాయం ఏమిటి? నిజంగా మన భూపతిరాజు అమాయకంగా మన సందికి యిచ్చాడా? కాక ఏదైనా దుర్బుద్ధి వుందా? చెప్పలేం. ఈ రోజుల్లో ఏ పుట్టలో ఏ పాముందో? అంతే కాదండీ, 'కాంతను జూడ కనకంబును జూడ బ్రహ్మకైన బుట్టు రిమ్మతెగులు' అన్నారు కదండీ! అందుకోసం నాకేదో భయంగా, సందేహంగా వుంది' అంటూ తీర్పుకోసం ఎదురుచూస్తున్నట్లు ఆగిపోయింది.

ఈ మాటలు విని తొలుత, భూపతిరాజు సందిని కాంక్షిస్తూ దాన్ని వశపరచుకునేందుకు చేసిన ఎత్తు యిది అంటూ చెప్పి అతణ్ణి దోషిగా నిలుపుదామనుకున్నాడు. కానీ తానూ ఆ కోవలోనివాడే కాబట్టి జగదీశ్వరీ దేవిని అప్రమత్త చేయడం భావ్యం కాదు.

రేపు జరగవలసింది ఎంతో వుంది. సంది గతమైన తన వాంఛకు దాహం ఎక్కువౌతూ వుంది. అది తీరేదాక, ఎంతో చాకచక్యంతో హుందాగా ప్రవర్తించాలి' అంటూ నిర్ధారించుకుని ఎంతో సహజంగా నవ్వుతూ.

'అదేంటి? జగూ! ఎన్నడూ లేంది నీ మనస్సులో అనుమానం చోటు చేసుకుంది? పెంచిన ప్రేమవల్ల నీకలా అది ముద్దుగా కనిపిస్తుందేమో? కానీ' అనేమాట పూర్తి కాకుండానే 'మీరు మాత్రం దాన్ని ముద్దుచేయరా? ఏంటి? ఎంతైనా మనం పెంచాం. మనం చేసిందానికన్నా నాల్గురెట్లు సేవచేస్తూ దాని రుణాన్ని తీర్చుకుంటూనే వుంది' అంటూ జగదీశ్వరీదేవి అడ్డు తగిలింది.

'విషయం పూర్తిగా వినకుండా నీ నిర్ణయముద్రతో చర్చకు మంగళం పాడడం నీ కలవాటైంది. కానీ ఈ విషయం చాలా సున్నితమైంది. పైగా మన బంధువర్గానికి సంబంధించింది. అందుకే నా మాటకూడా విను అంటున్నాను' అన్న భర్త మాటకు ఎదురాడక 'సరే! వింటున్నాను చెప్పండి' అంది.

'జగూ! వాస్తవాన్ని ఆలోచించు. అది చేసేది వూడిగం. కారు చీకటిలాంటి రంగు. చదువూ సంస్కారంలేని బ్రతుకు. పేరులేని వంశం. అన్నిటికన్న ముఖ్యంగా సర్చ్‌లైట్లులా నీ కళ్లు ఎప్పుడూ శోధిస్తూ వుంటే ఆ నీడల్లో పెరిగే దాన్ని ఎవరు కోరుకుంటారు? కామోపభోగం కోసం చండీశక్తిలా నీవు రక్ష చక్రానివై కాపలా కాస్తుండగా ఎవ్వడికి అన్ని గుండెలు? అందుకోసం, డబ్బూ, వయసూ, వంశగౌరవమూ వున్న భూపతిరాజు గారికేం పని? ఆ పిల్లను మరో దృష్టితో చూచేందుకు? కొరివితో నెత్తి గోకున్నట్లు' అంటూ చర్చను ముగించాడు.

తన భర్త మాటే నిజం కావచ్చు అంటూ జగదీశ్వరీదేవి ఆప్రస్తావనను అంతటితో ఆపేసింది.

తెల్లారి లేవగానే జగదీశ్వరీ దేవి సందిని పిలిచి 'సందులూ! యిదిగో యీ చీర, ఈ పౌడరు డబ్బా నీకోసం కానుకగా తెచ్చి యిచ్చాడు. నిన్న మన భూపతిరాజుగారు నీ కిచ్చిన పొట్లం అదే! తీసుకో' అన్నది.

ఆ కానుకను చేతితో కూడా తాకకండా సంది 'అమ్మా! నాకెందుకండి చీరెలూ, గిరెలు? పొద్దస్తమానం నడుం చుట్టి పని చేసేదానికి సినీమా బొమ్మతీర్గ యీ మెరెపు చీర ఎందుకండి? మీకాడే వుంచండి. మరెప్పుడైనా తీసుకుంటాను. అంటూ ఆపాదమస్తకం భగ్గునమండుతూ వుంటే పని వుందన్న నెపంతో వెళ్లిపోయింది అక్కడినుంచి సంది.

సందికి మెలమెల్లగా విషయం అంతా అర్థమౌతూవుంది. అయినా తాను చేయగలిగింది ఏమీలేనట్లూ కనిపిస్తూంది. తన్ను తాను జాగ్రత్తగా పరిరక్షించుకోవాలి.

పెద్దయ్యగారితో చెబితే. ఏమని చెబుతుంది? ఏం జరిగిందని చెబుతుంది? అనవసరంగా బయటపడి తాను యింతకాలం ఏమీ తెలియని ' ఎడ్డిమాలోకం' అనే ముసుగును తొలగించుకోవాల్సివస్తుంది. అప్పుడు కష్టాలు కొనితెచ్చుకున్న దాన్నౌతాను' అంటూ ఎప్పుడూ వొంటరిగా లేకండా ఎవరో ఒకరు మెదిలేదగ్గర మసల్తూ వుంది.

ఎండాకాలం సెలవలు దగ్గర పడ్తున్నాయి. ఈ రోజో రేపో బాబు రావచ్చు. వాడి ఎం.ఎ. కూడా పూర్తౌతుంది. పెళ్లి సంబంధాలు చూడాలి. సంబంధాలకేం కొదువ? దేవకన్యల్లాంటి అమ్మాయి లెందరో వరసలో నిలబడివున్నారు. వాడికి నచ్చిన పిల్లనే ఎంపిక చేస్తే మంచిది' అంటూ ముసిముసి నవ్వులతో రేపో? ఎల్లుండో పెళ్లి అన్నట్లు అలమారాలన్నీ సర్దుతూ సంది సాహాయ్యంతో నగలన్నీ లెక్కగా వేరు వేరు డబ్బాలల్లో అమర్చి పెడ్తూవుంది. తరాలనాటి పీతాంబరాలు, అపురూపమైన మువ్వంచు చీరలూ, చేతి వొడ్పుతో కుట్టు తీర్చిన రవికెలు అన్నీ భద్రంగా తుడ్చి డాంబరు గోలీలు వేసి పెట్టిస్తూ వుంది.

ఇలా యింట్లో సందడి వో వారం రోజుల నుండి సాగుతూ వుంది. ఇంత సందడిలో సయితం జగన్నాథం గారూ, భూపతిరాజుగారు పోటాపోటీగా సందిని ఎలా కైవసం చేసుకోవాలి? అంటూ తంటాలు పడ్తూ సమయం కోసం ఎదురు చూస్తున్నారు.

ఓమారు సంది ఏ అరమరికలు లేకండా జగన్నాథం గారి గది శుభ్రం చేస్తూ వుంది. అది చూసిన జగాన్నథం గారు లోన ప్రవేశించి అద్దంలో ప్రతిఫలించే సంది వెనక నిల్చుని 'సందీ! యిలా చూడు! మీ అమ్మగారు అందంగా వున్నారా? నేను అందంగా వున్నానా? అంటూ ఎంతో సాధారణంగా ధ్వనిస్తూ ప్రశ్నించాడు.

ఆ మాటతో చకిత అయిన సంది 'అయ్యగారూ మీరిద్దరూ ముద్దుగానే వున్నారు. మీరిద్దరూ పార్వతీ పరమేశ్వరుల్లా వున్నారు. ఎచ్చుతచ్చులు ఎలా చెప్పగలరండి ఎవరైనా?' అంటూ జగన్నాథం వూహించలేని రీతిలో సమాధానం యిచ్చింది. అంతతో ఆగక జగన్నాథంగారు 'పోనీ, సందీ! నీవు అందంగా వున్నావా. నేనా? అంటూ కోరికలు తీవ్రపెడ్తూ వుంటే సమీపిస్తూ ప్రశ్నిస్తున్నాడు.

సంది భయాన్ని నటిస్తూ 'అదేటండి అయ్యగారూ! నక్కకూ నాగలోకానికి పోలిక ఏటండి? కిరీటాన్ని చెప్పుతో ఎలా పోలుస్తారండి? మీకాలి దుమ్మకు కూడా పోలని నాకు అందమేటండి? మీరు దేవుడిలా వున్నారు. మీకు 'టి' పట్టుకొస్తాను వుండండి' అంటూవుంటే.

సగం చచ్చిన జగన్నాథం గారు గంభీరంగా యిప్పుడిక 'టీ వద్దులేవే! అంటూ వెళ్లిపోయాడు.

ఇదంతా వో కంట కనిపెడ్తూన్న భూపతిరాజు వుడికి పోతున్నాడు. 'పులుప్ర చచ్చినా చేవ చావలేదన్నట్లు బావగారికి ఈ వయస్సులో కూడా వ్యసనాలేవీ తగ్గినట్లు లేదు.

ఆ పులుసు మాత్రం ఎక్కడ చచ్చింది? జగదీశ్వరీదేవి గారిచలువతో ఆవు నెయ్యా, గడ్డ పెరుగూ చేపల వేపుడూ, పక్షిమాంసాలూ తగు విధంగా నానా వోషధులూ కలిపి భక్షిస్తూ వుంటే నానాటికీ శరీరదారుఢ్యం పెరుగుతూంది తప్ప తరుగేది? దాంతో పాటే సుఖాసక్తీ పెరుగుతుంది. ఈయనే, యిలా వుంటే నాకోరికలో నా తప్పేముంటుంది? ప్రయత్నలోపం తప్పితే? అంటూ సందిని ఎలాగైనా అనుభవించి తీర్తాను అనుకున్నాడు.

ఇలాంటి విషయాల్లో వావి వరుసలుండవేమో? ఎంత అన్యాయం! ఇద్దరి మనస్తత్వాలు యిద్దరికీ తెలుసు. అయినా ఒకరికి తెలియకండా మరొకరు రహస్య గోపనం చేసుకుంటున్నారు. బావామరదులు యిద్దరూ.

ఈ ఇద్దరిలో ఏ ఒక్కరైనా సంది మనస్సును గూర్చి ఆలోచించలేదు. దానికి అన్యాయం చేస్తున్నామే అనే ధ్యాసేలేదు. 'నలుగురు నడిచే బాట, పదుగురి దప్పి దేర్చే కాసారం, అందరినీ అనుగ్రహించే దేవాలయంలా పాపం అండలేని ఆడపిల్ల అందరి కామక్షుధను తీర్చేదిగా కనిపిస్తూంది'. నిజం ఆలోచిస్తే సంది గర్భదాసికానీ, వేశ్యకానీ కాదు. పెళ్లికావలసిన పిల్ల, దాని తండ్రి వీరిని నమ్మి ఆ యింట్లో వుంచాడు అంతే! అలాంటి అవివాహిత కన్యను, కంచే చేను మేసినట్లు ఆశిస్తున్నారు, ఆ యింటి ఘరానా పురుషోత్తములు.

ఆనాడు సంది తలంటి స్నానం చేసి నుదుట తిలకం తీర్చుకుని జగదీశ్వరీదేవి గదిలో ఆమెకు తోడుగా వుంటూ అన్ని పనులూ చేసింది. పని దాదాపు ముగిసిన తరువాత జగదీశ్వరీదేవి స్నానానికంటూ వెళ్లిపోయింది. పోతూ పోతూ ఆమె అమూల్య కర్ణాభరణం ఒకటి పారవేసుకుంది. నిజానికి జగదీశ్వరీదేవి మరిచేపోయిందో? కాక సందిని పరీక్షిద్దామని కావాలంటూ? జారవిడిచిందో. తెలియదు.

సంది చిందరవందరగా పడ్డ డబ్బాలన్నీ తీస్తూ గదిని వూడుస్తూ వుంటే డ్రెస్సింగ్ టేబుల్ పక్కవైపున కండ్లు చెదిరే కాంతితో వజ్రాల లోలాకు కనిపించింది. ఏ జంకూ గొంకూ లేకుండా అది తీసి కొంగులో కట్టుకుని అమ్మగారి కిస్తానంటూ నడుములో దోపుకుంది.

ఎప్పుడూ దాన్నే కనిపెట్టుకు తిర్గుతున్న జగన్నాథం గారి కంట్లో ఈ పనిపడింది. ఆయన యిదే మంచి తరుణం అంటూ గదిలో ప్రవేశించి రెండు చేతుల్తో సందిని గట్టిగా అలుముకుని అసభ్యంగా ప్రవర్తించడం ప్రారంభించాడు. ఆ చేతుల్లో సంది గిలగిలా గింజుకుంటూ 'అయ్యగారు యిదేటండి అలా పట్టుకున్నారు వదలండి' అంటూ విడిపించుకునే ప్రయత్నం చేస్తూ వుంది.

'ఎన్నాళ్లనుండి వూరిస్తున్నావే దోరపండులా? నీవు చేసింది నేను చూడలేదను కున్నావా? నేను చెప్పినట్లు గప్‌చుప్‌గా విను. అమ్మగారితో ఏం చెప్పను. ఆ వస్తువు నీకే దక్కుతుందిలే' అంటూ కొంగులాగాడు.

పయ్యెద జారగానే యిన్నినాళ్లనుండి గుప్తంగా దాచుకున్న శృంగార ధనమంతా ప్రకటితమై అయ్యగారికి మరింత పిచ్చెక్కిస్తూ వుంటే దాని కొంగు గట్టిగా లాగుతున్నాడు. తన స్థితి యావత్తూ మరిచిన జగన్నాథం.

అక్కగారి గదిలో ఏదో కలకలం జరుగుతున్నట్లు పసిగట్టిన భూపతిరాజు గబాగబా వచ్చి చేతిలో సంది కొంగు పట్టుకుని లాగుతున్న జగన్నాధాన్ని చూశాడు.

భూపతిని చూచిన జగాన్నధం వో రెప్పపాటు తడబడి వెంటనే తనకు అలవాటైన ఠీవితో 'భూపతి! చూశావా! యిదెంత పనిచేసిందో? తిన్నింటి వాసాలు లెక్కపెట్టినట్లు ఈ నీచురాలు నల్లనాగులా మనింట్లో చేరి మీ అక్కగారి నగేదో దొంగిలించింది. అదేదో యిలా తెమ్మంటూ వుంటే తనకేమీ తెలియదంటూ బుకాయిస్తొంది. దొంగముండ, ఆ పనేదో నీవే చూడు' అంటూ భూపతికి అప్పగిస్తూ పెద్దరికాన్ని నిలుపుకున్నాడు.

భూపతి బెదిరిస్తే వశమౌతుందనే భావనతో 'ఏమే? సంది కుక్కకు నెయ్యి యిముకనట్లు నీకూ యీ జమీందారీ అన్నం జీర్ణం కాలేదు. అందుకే అత్యాశకు పోయి అమ్మగారి సొమ్మునే కాజేశావ్. ఏదీ తియ్యి? ఎక్కడ దాచావో' అంటు దాని కొంగు పట్టి లాగుతూ సింహద్వారం దాటి యివతలికి లాక్కొచ్చాడు.

ఈ అల్లరి విని నల్గురూ బుజబుజమంటూ పరుగెత్తుకొచ్చి గుమిగూడుతున్నారు. గుంపులు గూడిన జనం, ఎవ్వరికీ ఏమీ అర్థ కావడంలేదు. దేవుడుల్లాంటి యింట్లో ఏం నేరం జేశావే తల్లీ! అంటున్నారు. ఇంతలోకే స్నానం ముగించుకుని జగదీశ్వరీదేవి కూడా వచ్చి సింహద్వారం ముందు నిల్చుంది. ఇంతకూ ఆమెకు ఏం జరిగిందీ, ఏం జరుగుతున్నదీ తెలిసి రావడం లేదు. ఇంతకింతకు జనంలో వుద్రిక్తత ఎక్కువౌతూ వుంది. భూపతిరాజు చేతిలో చిక్కిన కొంగు ఆసాంతం వూడుతూ పోక ముడి వరకూ వున్న చింగులన్నీ జారిపోయాయి.

ఏ తొణుకూ బెణుకూ లేని స్వరంతో జగన్నాథం 'భూపతీ! ఈ పిల్ల మీద చేయి మాత్రం చేసుకోకు సుమా! వేసే శిక్ష ఏదో ఈ జనమే తేల్చి చెబుతారు, మన యింటి ఎదురుగా వున్న రచ్చ కట్ట దగ్గరి వేపచెట్టుకిందికి తీసుకెళ్లు' అన్నాడు. అది వో! అంటూ ఏడుస్తూ వుంది. నిజానికి భూపతిరాజు ఆ సందిని వివస్త్రను చేసి ఆనందిచాలనే అనుకున్నాడు.

ఇంతటి అవమానం తరువాత దాన్ని ఎవరు మనువాడ్తారు. అప్పుడు జగన్నాథంగారు జాలిగుండెతో, సంది తండ్రిని పిలిచి 'రాముడూ దిక్కులేనివాడివి. దాని కళ్లకు కొవ్వెక్కీ, యీ గడ్డితిన్నా, పెద్ద మనస్సుతో దాన్ని క్షమిస్తాను. నీవేం భయపడకు, దానికి కూడూ గుడ్డా యిచ్చి భరిస్తాను' అంటూ పెద్దరికం ప్రదర్శించవచ్చు. అప్పుడు జనమంతా జగన్నాథం గారు మా దొడ్డ మనుష్యులు' అంటూ జేజే కారాలు చేస్తూ వెళ్లిపోతారు. సంది ఆజన్మ

దాసిగా, తన కాళ్లకింది పీచులా పడివుంటుంది. ఎంగిలి విస్తరి ఎప్పుడైనా భూపతికి వుపకరించక పోతుందా? జగన్నాథం కన్న ముందే సందిని తాను దక్కించుకుంటాడు. అందుకే 'అందరు అసహ్యించుకునే లా దీన్ని ముందు వివస్త్రను చేయాలి. గుడ్డిలోకం. నిజం ఎవరికి తెలుస్తుంది. రెడ్ హాండెడ్‌గా పట్టుబడినట్లు దాని కొంగులో డయమండ్ లోలాక్ వుంది'!. అంటూ రెట్టింపైన బలంతో చూపవే! నీవు దాచిన నగ' అంటూ చీరను పూర్తిగా లాగాడు. వూడిన ముడి పూర్తిగా జారి దిసమొల కాకుండా సాధ్యమైనంత మట్టుకు ప్రయత్నిస్తూంది సంది.

ఇంతలోకే జీపు ఆగిన శబ్దం వినిపించింది. హరిబాబు! హరిబాబు! అంటూ కలకలం ప్రారంభమైంది.

సంది తండ్రి రాముడు కిందపడి పొర్లుతూ, మట్టి నోట్లో పోసుకుంటూ జగదీశ్వరీ దేవి కాళ్లు చుట్టుకుని 'తల్లీ! దీని బ్రతుకేం కాను. నిజంగా దొంగతనం చేస్తే దాన్ని నేనే కత్తికోకండగా నర్కుతాను. సున్నం ఇరబోసి అందులో పడేసి నిల్చునా ప్రాణాలు తీస్తాను. అంతేకాని చావుకన్నా గోరమైన ఈ దండనవద్దు. అమ్మా! గౌరమ్మలా వున్నావ్. వద్దను. ఎదిగిన పిల్ల సిగ్గు వోయినంక, కుక్కముట్టిన కూడంట. ఎవరు దీన్ని పెండ్లి జేసుకుంటరు' అంటూ గోడు గోడున ఏడుస్తున్నాడు.

గుంపులు గూడిన జనాన్ని తోసుకుంటూ హరిబాబు ముందుకు నడిచాడు. చూపుకు వ్రేగ్రె, హృదయ విదారకమైన దృశ్యాన్ని చూచాడు. హరిబాబును చూడగానే యిందాక సంపూర్ణ నగ్న కాకండా వూడిన చీర కొనను భద్రంగా రక్షించుకుంటూన్న సంది చేతులు రెండింటిని తీసి కళ్లు మూసుకుంది. ఆవేగంలో, అవమాన భారంతో వెర్రెత్తిన సందికి తానేం చేస్తున్నదీ తెలియలేదు. చేతులు తీయగానే తన సిగ్గునూ స్త్రీత్వాన్నీ కప్పుతున్న ఆకాస్త అచ్ఛాదనం తొలగి సంది సంపూర్ణ నగ్నమూర్తి అయి నిలిచింది. అప్పుడది మనిషిలా లేదు. పార్వతీ దేవి విగ్రహంలా వుంది.

కొద్ది కొద్దిగా విషయాన్ని అవగతం చేసుకున్నాడు బాబు. అమానుషమైన ఈ ఆటవిక శిక్షను సహించలేదు. శరవేగంతో దూసుకువెళ్లి నగ్నమూర్తిని 'శ్యామలీ' అంటూ కౌగిలించుకున్నాడు.

అది చూచి అందరూ నిశ్చేష్టులయ్యారు. కొంతసేపటికి తేరుకున్న తండ్రి 'వీడికీ సోకింది ఈ రోగం అంటూ, కొడుకుని పెద్దగా 'హరీ! ఏమిటీ నీవు చేస్తున్న పని అన్నాడు'.

'ఏమీలేదు నాన్నా! సందిని నేను పెళ్లాడుతున్నాను. ఈ దోషానికి యిదొక్కటే పరిహారమార్గం' అంటూ విడిపోయిన చీరను దాని మొలకు చుట్టి, దాని తండ్రిని వుద్దేశించి 'రాముడూ రా ! జీపు ఎక్కు!' అంటూ తండ్రీ కూతుళ్లను ఎక్కించుకుని కదిలి వెళ్లాడు. అందరూ నోర్లు తెరచి చిత్రపటంలో బొమ్మల్లా వుండి పోయారు.